క్లుప్తంగా

లలితా పీఠానికి వెండి ఊయల బహూకరణ


వెండి ఊయలను ఆవిష్కరిస్తున్న లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారి ఊంజల్ సేవకు భక్తులు వెండి ఊయలను కానుకగా సమర్పించారు. కొంత మంది భక్తులు కలిసి సుమారు మూడున్నర కిలోల వెండితో తయారు చేసిన వెండి ఊయలను లలితా పీఠానికి బహూకరించారు. బుధవారం ఉదయం కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా వెండి ఊయలను ఆవిష్కరించారు. కుర్తాళం పీఠపురోహితుడు మాచర్ల రమేష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజూ రాత్రి 8.45 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ జరుగుతుందని, ఇక నుంచి వెండి ఊయలలో ఈ సేవ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

బోర్ల నుంచి మురుగు నీరు


యూజీడీ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద్, ఏఈ రహీమ్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట దుర్గాగణపతి ఆలయ సమీపంలోని ఇళ్లల్లో మూడు బోర్ల నుంచి కొద్ది రోజులుగా మురుగు, దుర్వాసనతో నీరు వస్తోందని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్, సారిపిల్లి గోవింద్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో విషయాన్ని వాటర్ వర్క్స్ ఏఈ రహీమ్‌కు తెలియజేయడంతో, బుధవారం ఉదయం కార్పొరేటర్‌తో ఆయన కలిసి ఇబ్బంది ఎదురవుతున్న ప్రాంతంలో యూజీడీ పైప్‌లైన్లు, సెప్టిక్ ట్యాంకుల పరిస్థితిని పరిశీలించారు. నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షకు పంపించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, స్థానికులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్వరరావు

సీతమ్మధార: స్థానిక చైతన్యనగర్‌లోని వినాయక, షిర్డీసాయిబాబా ఆలయంలో సప్తాయన ఆలయ సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వద్ద నేరాలు, దొంగతనాలను నియంత్రించవచ్చన్నారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో బోరు ఏర్పాటు


బోరుకు పంప్ బిగిస్తున్న టెక్నీషియన్లు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో స్థానిక సభ్యులు ఇచ్చిన విరాళాలతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. దీనికి సబ్‌మెర్సిబుల్ పంప్ బిగించే పనులు బుధవారం నిర్వహించారు. ఇందుకు అవసరమైన విరాళాన్ని క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేజీ కృష్ణారావు అందించారు. బోరు మంజూరుకు సహకరించిన 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పంపు ఏర్పాటుకు విరాళాలు అందించిన కృష్ణారావుకు వాకర్స్ క్లబ్ సభ్యుల తరఫున క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ 'జగనన్న సురక్ష'

- ఉచితంగా ధ్రువపత్రాల అందజేత
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 49వ వార్డులో 1,140 సర్టిఫికెట్ల పంపిణీ


లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు, జేడీ కృష్ణ

మురళీనగర్: ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందించడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 49వ వార్డు ఏఎస్సార్ నగర్ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. దీని ద్వారా పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి వారి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని టోకెన్లు అందించారన్నారు. వాటిని తీసుకున్న వారందరి సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందించడంతో జగనన్నపై ప్రజలకు నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు. జగనన్న సురక్షలో 11 రకాల ధ్రువపత్రాలను నేరుగా అందిస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు, ఉచిత సేవలు లబ్ధిదారులందరికీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ కె.కె.రాజు పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు కె.కె.రాజుతో పాటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సర్టిఫికెట్లు అందించారు. వార్డులో లబ్ధిదారులకు 1,140 ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు కార్పొరేటర్ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, తహసీల్దార్ జయ, ఏపీడీ పద్మావతి, ఏఈ అర్చన, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, పార్టీ 49వ వార్డు నాయకులు సబ్బవరపు శ్రీను, మెర్సీ, శంకర్, సుధాకర్, శివప్రసాద్, చైతన్య భాస్కర్, కిషోర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చేతికే కుల ధ్రువపత్రం అందించారు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎవరి చుట్టూ తిరగకుండానే నాకు కుల ధ్రువపత్రం అందించారు. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ కష్టాలు తీరాయి. మా వార్డులోని సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు పథకాలు నేరుగా పారదర్శకంగా అందించడానికి కృషి చేయడం హర్షణీయం. సీఎం జగన్‌కు మా కృతజ్ఞతలు. – కిల్లి హర్ష, సత్యానగర్

జగనన్న సురక్ష గొప్ప కార్యక్రమం



ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్న జగనన్న సురక్ష ఒక గొప్ప కార్యక్రమం. ముందుగానే వలంటీర్లు, గృహసారథులు దీనిపై పూర్తిగా అవగాహన కల్పించారు. మా కార్పొరేటర్ అల్లు శంకరరావు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించడమే కాకుండా ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే మా సమస్యను నమోదు చేయించి టోకెట్లు అందించారు. తద్వారా నేను కుల ధ్రువపత్రం పొందాను. – ఎం.ఈశ్వరమ్మ, బర్మా క్యాంప్

211 టన్నుల సబ్సిడీ టమాటా విక్రయాలు

- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ వెల్లడి



సీతమ్మధార: విశాఖ జిల్లాలోని 13 రైతుబజార్లలో 211 టన్నుల సబ్సిడీ టమాటాలు ఇప్పటివరకు విక్రయించినట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ వెల్లడించారు. బుధవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు మదనపల్లి, పలమనేరు నుంచి టమాటా సరకును కొనుగోలు చేసి జిల్లాలోని 13 రైతుబజార్లలో విక్రయించినట్లు తెలిపారు. ప్రభుత్వం కిలో టామాటాను రాయితీపై రూ.50కు అన్ని రైతుబజార్లలో ఈ నెల 2 నుంచి అమ్మకాలు ప్రాంభించినట్లు గుర్తుచేశారు. బుధవారం వరకు 211 టన్నుల టమాటాలను వినియోగదారులకు విక్రయించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు జిల్లాలోని 13 రైతుబజార్లలో 20 నుంచి 25 టన్నుల టమాటా సరకు అవసరమని ఇప్పటికే రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వహణాధికారికి సమాచారమిచ్చామన్నారు. అన్ని జిల్లాల కంటే విశాఖలో ఎక్కువ శాతం వినియోగదారులకు టమాటాలు విక్రయించినట్లు చెప్పారు. వినియోగదారులకు ప్రతి రోజూ సబ్సిడీ టమాటా అందేలా కృషి చేస్తామని షేక్ యాసిన్ అన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు


కంచరపాలెం వద్ద తోపుడు బండిని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం: కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్డు కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశి జంక్షన్ వరకు తోపుడు బళ్లు, రాంగ్ పార్కింగ్ వాహనాలను తొలగించినట్లు సీఐ తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై సచివాలయ సిబ్బంది జరిమానాలు విధించారన్నారు. ద్విచక్ర వాహన చోదకులు సర్వీస్ రోడ్డులో సింగిల్ పార్కింగ్ చేయాలని, రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా డబుల్ లైన్‌లో పార్క్‌చేసిన కార్లు, ఆటోలపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐలు పాపారావు, ఉల్ హక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందు కోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

సింహాచలం: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రాన్ని బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 2019 వరకు రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలు మాత్రమే ఉండేవన్నారు. 2019 తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టామన్నారు. అందులో ఐదు కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ఇస్తున్నామన్నారు. దాంతో 750 సీట్లు కొత్తగా ఈ సంవత్సరం పెరుగుతున్నట్టు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి వైఎస్సార్ కంటి వెలుగు, స్కూల్ పిల్లలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు.

27న పురందేశ్వరి రాక

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 27వ తేదీన విశాఖ వస్తున్నట్లు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి విశాఖకు వస్తుండటంతో.. ఆమెకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పదాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య సమక్షంలో స్వాగత ఏర్పాట్లపై సుజాతరాజ్ చర్చించారు. పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి పురందేశ్వరికి స్వాగతం పలకాలని నిర్ణయించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలోని హైటెన్షన్ లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, రామచంద్రనగర్, కేంద్రీయ విద్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక కార్యాలయం, ఆంధ్రజ్యోతి ప్రెస్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మర్రిపాలెం సెక్షన్‌లో రేపు..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, సిద్ధార్థనగర్, 104 ఏరియా, బాపూజీనగర్, భవాని గార్డెన్స్, శ్యామ్ నగర్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన


బర్మా క్యాంప్‌లో పనులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

మురళీనగర్: ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంప్ సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనులను బుధవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పరిశీలించారు. ఈ విస్తరణలో షాపులు కోల్పోయిన వారు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. చిరు వ్యాపారుల బతుకు తెరువుకు అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, టీపీవో శ్రీలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో ఆగస్టు 18 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఇవి సెప్టెంబరు 15తో ముగుస్తాయన్నారు. ప్రతి శుక్రవారం పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని, పాల్గొనాల్సిన వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఈవో కోరారు.

ఎంఎస్ఎఫ్-5లో చెత్త నిల్వ ఉంచొద్దు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జోన్-5 పరిధి తాటిచెట్లపాలెం ఎంఎస్ఎఫ్‌లో చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 3, 4, 5, 8 పరిధిలోని పాత జైల్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం, పెందుర్తి, సుజాతనగర్, దత్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. పాత జైల్‌రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహ కూడలి పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలు, జైల్‌రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధి సుజాతనగర్‌లో పర్యటించి గిరిప్రసాద్ నగర్‌లో నూతనంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహనరావు, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



అరకు రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి


చిల్డ్రన్స్ పార్క్‌లో మొక్క నాటుతున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం వాల్తేర్ డివిజన్ జగదల్‌పూర్ నుంచి కొత్తవలస సెక్షన్ పరిధిలో విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. వాతావరణంలో మార్పులు రానున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. జగదల్‌పూర్, జయ్‌పూర్, కోరాపుట్, పాడువా, అరకు రైల్వే స్టేషన్లలో ఆయన పర్యటించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికప్రతినిధులు, మీడియా ప్రతినిధులను డీఆర్‌ఎం కలిసి వారితో ఆయా ప్రాంతాల సమస్యలపై చర్చించారు. తమ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా పలు స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాల మెరుగు, ప్రత్యేక రైళ్లు, పలు రైళ్లకు అదనపు హాల్ట్‌లను కేటాయించడం హర్షించదగిన విషయమని స్థానిక ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై డీఆర్‌ఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాడువాలో నూతనంగా నిర్మించిన సీనియర్ సెక్షన్ ఇంజినీర్(పి.వే) కార్యాలయం, అరకులో ఆధునికీకరించిన రన్నింగ్ రూం, చిల్డ్రన్స్ పార్క్‌లను డీఆర్‌ఎం ప్రారంభించారు. సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కోఆర్డినేషన్) ఎ.కె.మహారాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు


సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురం సచివాలయం పరిధిలోని శ్రీనివాసనగర్‌లో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న దృఢ సంకల్పంతో తన కున్న మొత్తం సమయాన్ని వెచ్చిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నాయకులు పైడి రమణ, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, ఎస్.కుమార్, ఖాదర్, సన్యాసిరావు, చంద్రకళ, ప్రశాంత్, భానుమూర్తి, యశోద, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'పొగడ్తల పురాణం'పై ప్రసంగం



ప్రసంగిస్తున్న సాహితీవేత్త డాక్టర్ సూర్యారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సభలో సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు పొగడ్తల పురాణం అనే అంశంపై ప్రసంగించారు. పొగడ్త, ప్రశంస, స్తుతి, కీర్తించడం, శ్లాఘించడం, కొనియాడు ఇవన్నీ ఒకే అర్థాన్ని సూచిస్తాయని తెలిపారు. సందర్భం, స్థాయిని బట్టి పదాలు మారుతుంటాయన్నారు. మన దేవతలంతా స్తోత్ర ప్రియులేనని, మనకు అపారమైన స్తోత్ర సాహిత్యం ఉందన్నారు. రాజులను కీర్తిస్తూ కవులు కావ్యాలు అంకితం చేసేవారని గుర్తుచేశారు. శ్రీనాథుడు వివిధ సందర్భాల్లో పాలకులను స్తుతించి సన్మానాలు పొందిన ఉదంతాలు సాహిత్యాల్లో కన్పిస్తాయని తెలిపారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ దేవుని దగ్గర నుంచి సామాన్య మానవుని వరకు పొగడ్తలకు లొంగని వారు ఉండరన్నారు. రచయిత కె.జి.వేణు ప్రసంగాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, పేరి రవికుమార్, కొత్తూరి రమణ, రాంభట్ల నృసింహశర్మ, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీపీ సన్నాహాలు


మద్దిలపాలెం జంక్షన్‌లో పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

మద్దిలపాలెం: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా క్రమబద్ధీకరణకు పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలోని పెద్ద జంక్షన్ మద్దిలపాలెంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి బుధవారం ఆయన పరిశీలించారు. ఇటు శ్రీకాకుళం, విజయనగరం, మధురవాడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే మార్గంలో బీఆర్‌టీఎస్ రోడ్డును, గురుద్వారా వైపు వెళ్లే జాతీయ రహదారిని.. అటు త్రీటౌన్ వైపు వయా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా గల రోడ్డును పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఎటువంటి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టాలని డీసీపీలు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

సమయపాలన ముఖ్యం

- ఆరోగ్య సిబ్బందితో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు
- ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై సమీక్ష

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరంలో బుధవారం గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు, సబ్ యూనిట్ అధికారులతో మలేరియా, డెంగ్యూ ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, కుటుంబ నియంత్రణ పాటించాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, డాక్టర్ సలహాలు పొందేలా చూడాలని సూచించారు. నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని క్లినిక్స్‌లోనూ షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ మాట్లాడుతూ ఫీవర్ సర్వేలో మలేరియా, డెంగ్యూ కేసులను గుర్తించి వెంటనే తెలియచేయాలన్నారు. జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఎపిడిమిక్స్ రాకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులు రావడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వేలు చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డ్రోన్ టెకాలజీతో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఐఎస్‌టీడీ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ డాక్టర్ వీఆర్‌ఎం రావు తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన బుధవారం విద్యార్థులకు నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మెడికల్, ఆర్కిటెక్చర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కెమికల్ ఇంజినీరింగ్, వ్యవసాయ రంగాల్లో డ్రోన్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు వివిధ రకాల సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, పెట్రో కెమికల్ విభాగం సీనియర్ లెక్చరర్ కేబీవీఎస్ఎస్ కుమార్, ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారు.